క్లుప్తంగా

శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరికి పూజలు



నాదెండ్ల: గణపవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మ నక్షత్ర పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారు ఉత్తరా నక్షత్రాన జన్మించినందున గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామానికి చెందిన దోగిపర్తి సుబ్బారావు, విజయలక్ష్మి దంపతులు ప్రసాదాల వితరణ చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి పూజలు



నాదెండ్ల: మండలంలోని గణపవరంలో సింగు వారి ఇలవేల్పు అంకమ్మ తల్లి వార్షిక కొలుపులు పురస్కరించుకుని ఆదివారం నెల పొంగళ్లు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. గత నెల 28,29,30 తేదీల్లో అమ్మవారి వార్షిక కొలుపులు జరిపిన సంగతి తెలిసిందే. నెల పొంగళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి సింగు వారి కుటుంబ సభ్యులు హాజరై అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): స్నేహ నాట్య అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్యం, కర్నాటక సంగీతం, జానపద నృత్యం, కర్రసాములో 400మంది విద్యార్థినులు ఇటీవల అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో సుస్థిర స్థానం సంపాదించినట్లు ఆ అకాడమీ డైరెక్టర్ ప్రతిమ తెలిపారు. స్థానిక మెయిన్ బజారులోని సన్నిధి వెంకట ఆంజనేయులు ధ్యాన మందిరంలో వినుకొండకు చెందిన 48మంది విద్యార్థినులకు ఆదివారం వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అకాడమీ డైరెక్టర్ ప్రతిమను దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే షకీలా, ఎంస్‌కే బాషా, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.వి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వినుకొండ (నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ఓబయ్య కాలనీ సచివాలయం పరిధిలో గల 23వ వార్డులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. మదీనా మసీదు దగ్గర నుంచి సాయంత్రం 4గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొంటారు.

జాషువా జీవితం-సాహిత్యంపై వ్యాస రచన పోటీలకు స్పందన



సత్తెనపల్లి: విశ్వనరుడు గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు జాషువా జీవితం -సాహిత్యం అనే అంశంపై వ్యాసరచన పోటీల్ని స్థానిక ప్రగతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 116 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఇర్మియా, సురేష్ బాబు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వ్యాసరచన పోటీలకు పంపించిన స్కూలు ఉపాధ్యాయులకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రకటించిన విధంగా విజేతలకు బహుమతులను త్వరలో అందిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల్లో సంతోషం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే మేమంటున్న ప్రజలు
- గడప గడపకు విశేష స్పందన



నాదెండ్లలో గడప గడపకు కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: అభివృద్ధి, సంక్షేమంతో అన్ని వర్గాల ప్రజల్లో అంతులేని సంతోషం వ్యక్తమవుతోందని, సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే తాముంటామని ప్రజలు చెబుతుండటం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు గీటురాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం మూడో రోజు నిర్వహించారు. 3,4,12,13 వార్డుల్లో పర్యటించి, ప్రజలతో మాట్లాడుతూ ముందుకు సాగారు. చైతన్య కాలనీలోని ఏఈఎల్‌సీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రజలతో ముచ్చటిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో సాధ్యమైందని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిట్లోకి తెచ్చారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అన్ని పథకాల్ని ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన చేశారని తెలిపారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లతో అన్ని పదవుల్లో మహిళా సాధికారత సాధించేలా అడుగులు వేయించారని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు నామినేటెడ్ పదవుల్లో, ఇతర ప్రభుత్వ పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పించారని మంత్రి పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, చేయూత, వాహనమిత్ర, లానేస్తం వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాల్లో సంతోషాలు అందించారని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రంలోనే స్వర్ణయుగం ఆవిష్కృతమైందని పేర్కొన్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర ప్రభుత్వాలు మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్ని గమనిస్తూ, వారి రాష్ట్రాల్లో అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు మస్తాన్‌రావు, మార్కెట్ యార్డు చైర్మన్ రాజేంద్రప్రసాద్, గణపవరం, నాదెండ్ల సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు యల్లారావు, కుంభా అంకమ్మ, దావల ఏసమ్మ, ఏలియ్య, కె. రామకృష్ణయ్య, దార్ల పరమేశ్వరరావు, లక్ష్మయ్య, కాంద్రు శేషయ్య, చెంచురాజు, ఆలా శివగోపి, కోనేటి నాగయ్య, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, మద్దూరి కోటిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, కోయలమూడి సాంబశివరావు, సుభాని, రత్తయ్య, పెరుమాల్లపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల సీతారామిరెడ్డి, స్లీవారెడ్డి, వెంకటస్వామి, చేరెడ్డి వెంకటరెడ్డి, తోట బ్రహ్మస్వాములు పాల్గొన్నారు.

నాణ్యమైన నారుతోనే మిరపలో అధిక దిగుబడులు

- చిలకలూరిపేట ఉద్యాన అధికారి కిశోర్ కుమార్ యాదవ్
- నియోజకవర్గంలో 11 నర్సరీల్లో మిరప నారుమళ్లు తయారీ
- పోషకాల లభ్యత, తెగుళ్ల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలి



నర్సరీలోని మిరప నారును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కిశోర్ కుమార్ యాదవ్

యడ్లపాడు: ఇటీవల వాతావరణం చల్లబడి, అక్కడక్కడా జల్లులు కురవడంతో మిరప రైతులు నారుమడుల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో అధికంగా ఖరీఫ్‌లో సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే, రైతులంతా నాణ్యమైన నారును సిద్ధం చేసుకోవాలని చిలకలూరిపేట ఉద్యాన అధికారి ఎస్. కిశోర్ కుమార్ యాదవ్ సూచించారు. నారు విషయంలోనే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పంట నష్టం జరగకుండా ప్రభుత్వం కూడా ముందుగానే నర్సరీల్ని సంబంధిత శాఖల అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయిస్తోందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని 11 నర్సరీలను సందర్శించి, నిర్వహణ, రికార్డులు, నారు పెంచే తీరును పరిశీలించినట్లు వెల్లడించారు. చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లో రెండేసి నర్సరీలు ఉండగా, ఒక్క నాదెండ్ల మండలంలోనే -7 ఉన్నాయని చెప్పారు. చిలకలూరిపేటలో ఒకటి, నాదెండ్లలోని రెండు నర్సరీలకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్లు లేవని, వారంలోగా చేయించుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.

పర్యవేక్షణ తప్పనిసరి

కేవలం విత్తనాలను నర్సరీలకు అప్పగించి ఊరుకోకుండా పలుమార్లు వాటిని పర్యవేక్షణ చేయాలని, నారు పోసే విధానం, మొక్కగా రూపాంతరం చెందే క్రమంలో వచ్చే మార్పుల్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సీడింగ్ సమయంలో మొక్కలో ఆకుముడత, ఆకు మచ్చలు, నారుకుళ్లు వంటి తెగుళ్లు సోకుతున్నాయో లేదో గమనించాలన్నారు. అటువంటి వాటిని గుర్తిస్తే వెంటనేన శిలీంధ్ర నాశనులు చల్లుకుని నారుకుళ్లు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రధానంగా మొక్కలకు పోషకాల లోపం లేకుండా చూసుకోవాలని తెలిపారు.

విత్తు నుంచే రక్షణ చర్యలు

ట్రేలలో కోకోపిట్‌లో విత్తనాల్ని వేస్తున్నారని, సహజసిద్ధంగా భూమిలో మాదిరి మొక్కకు కోకోపిట్ ద్వారా పోషకాలు మొక్కకు లభించవని తెలిపారు. ఇందుకోసం 19-19-19, ఫార్ములా -4 సూక్ష్మధాతువును కోకోపిట్‌లో విత్తుకు ముందుగానే కలుపుకోవాలని సూచించారు. 20 రోజుల తర్వాత తిరిగి వాటినే నారుపై పైపాటుగా చల్లుకుంటే సమగ్రంగా పోషకాలు అంది మొక్కల ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. నారు సమయంలోనే తెల్లదోమ రాకుండా మొక్కల్ని కాపాడుకునేందుకు పసుపు జిగురు అట్టల్ని ఎకరాలనికి 30-40 మధ్య ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నారుకు ఎంతో మేలు చేసే జీవ శిలీంధ్రాలు ట్రైకోడెర్మవిరిడి, సూడోమోనాస్, వీఏఎంను కోకోపిట్‌లో కలుపుకొని విత్తనాలు నాటితే వేరుకుళ్లు బారి నుంచి శాశ్వతంగా రక్షించుకోవచ్చని చెప్పారు.

బీఎల్‌వో విధులకు అంగన్‌వాడీలపై ఒత్తిడి తగదు

నరసరావుపేట: బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో) డ్యూటీలు చేయాలని అంగన్‌వాడీలను ఒత్తిడి చేయడం తగదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి. మల్లీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనేక యాప్‌లు, రిజిస్టర్లలో వివరాల నమోదుతో పాటు పిల్లలు, తల్లులకు పోషకాహారం వండి పెట్టాల్సిన బాధ్యతలు ఉన్న నేపథ్యంలో అంగన్‌వాడీలు బీఎల్‌ఓ విధులకు హాజరుకావడం సాధ్యం కాదన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్కూల్లోనే ఉండాలని, ఈ నేపథ్యంలో బీఎల్‌వోగా ఇళ్లచుట్టూ తిరిగే డ్యూటీకి వెళ్లడం కుదరదని తెలిపారు. గతంలో అనేక పోరాటాలు చేసి ఈ విధుల నుంచి వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో 2019లో విముక్తి లభించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం రాజుపాలెం, సత్తెనపల్లి మండలాలలో ఉద్యోగుల కొరత అంటూ అంగన్‌వాడీలను బీఎల్‌వో విధులకు హాజరుకావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ఒత్తిడి పెరిగితే ఉద్యమం చేస్తామని మల్లీశ్వరి హెచ్చరించారు.

కేబుల్ వైర్లను కత్తిరించిన దుండగులు

- పట్టణంలో నిలిచిపోయిన ప్రసారాలు
- చానల్ నిర్వాహకుడి ఫిర్యాదుతో కేసు నమోదు

నరసరావుపేట టౌన్: కేబుల్ వైర్లు కత్తిరించి ప్రసారాలకు అంతరాయం కల్గించడంపై వి.చానల్ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ ఎన్. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ కళాశాల, ప్రకాష్‌నగర్, ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో దుండగులు శుక్రవారం రాత్రి కేబుల్ వైర్లను కత్తిరించారు. దీంతో పట్టణంలో వి.చానల్ ప్రసారాలు శనివారం నిలిచిపోయాయి. ఈ మేరకు చానల్ నిర్వాహకులు భూమిరెడ్డి కొండారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేబుల్ వైర్లు కట్ చేసిన ప్రాంతంలో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి ఇద్దరు నిందితుల్ని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

వేద పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులకు స్థానిక అగ్నిమాపక శిక్షణ కేంద్ర ఉద్యోగి కూచిపూడి శ్రీనివాసరావు దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. ఆశ్రమ పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా హాజరై వస్త్రాలను అందజేశారు. వారికి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద విద్యార్థులు ఆశీర్వచన నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. విద్యార్థులకు నూతన వస్త్రాలు అందించిన శ్రీనివాసరావు దంపతులకు వేద పాఠశాల గురువులు రత్నమాచార్యులు అభినందనలు తెలిపారు.

టమాటాల పంపిణీపై దుష్ప్రచారం తగదు

సత్తెనపల్లి: బహిరంగ మార్కెట్‌లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందుబాటులో లేకుండా కిలో రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతున్న టమాటాలను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా రూ. 50కే రాయితీపై పంపిణీ చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కిలో రూ.50 కే రాయితీ టమాటాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని రైతు బజార్‌లో షాపులు కేటాయించిన డ్వాక్రా గ్రూపుల ద్వారా టమాటాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సబ్సిడీ టమాటాలను వినియోగదారులకు అందజేయడాన్ని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాల కుట్రలో భాగంగా కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. బహిరంగ మార్కెట్‌లో టమాటలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు సబ్సిడీపై రూ.50కే కిలో చొప్పున అందిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్న క్రమంలో పథకం ప్రకారం టమాటాలు పంపిణీ పక్కదారి పడుతుందంటూ అసత్య ప్రచారాలు చేయడం అర్థరహితమని బాబూరావు ఖండించారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు అందించేలా చూడాలని, దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఆయన సూచించారు.

పల్లెలకు ఆరోగ్యదాతలు గ్రామీణ వైద్యులు



లైఫ్‌లైన్ హాస్పటల్ డాక్టర్ పి.రాజనందారెడ్డిని సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

నకరికల్లు: పల్లెలకు ఆరోగ్యదాతలుగా గ్రామీణ వైద్యుల సేవల్ని కొనియాడాలని డాక్టర్ పి.రాజనందారెడ్డి అన్నారు. నరసరావుపేటలోని లైఫ్‌లైన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు చేరువ చేశారని కొనియాడారు. తమ వైద్యశాలలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పల్లెల్లోను, మారుమూల ప్రాంతాలోనూ నివాసముంటున్న ప్రజలకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యుల సేవలు మరువలేనివని కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు పారామెడికల్ శిక్షణనిచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు షేక్ చింతపల్లి ఫకీర్‌అహ్మద్, రత్నం, రమణారెడ్డి, హుస్సేన్, ఆచారి, బ్రహ్మంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎంపీఏ డివిజన్ అధ్యక్షుడు షేక్.బాజి, డాక్టర్ పి.రాజ్యలక్ష్మి, డాక్టర్ ప్రసన్న లక్ష్మి, ఆర్ఎంపీ యూనియన్ నాయకులు చెన్నారెడ్డి, సైదా, నారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే నంబూరు పరామర్శ

అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామానికి చెందిన వేమవరపు నాగేశ్వరరావు ఇల్లు, చిన్న కిరాణా షాపు ఇటీవల పూర్తిగా దగ్ధం కాగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేలు తక్షణ సహాయంగా అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని, పక్కా గృహాన్ని మంజూరు చేయిస్తానని చెప్పారు. కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో సొసైటీ ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపు ప్రారంభం

శావల్యాపురం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సారథ్యంలో వచ్చే నెలాఖరులోగా శావల్యాపురం ప్రధాన సెంటరు మార్గంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించనున్నట్లు సీఈవో జాలాది నాగప్రసాద్ ఆదివారం తెలిపారు. కేంద్ర సహకార బ్యాంకు సౌజన్యంతో అన్ని రకాల ఔషధాలు తక్కువ ధరకు సరఫరా అవుతాయన్నారు. ఇందుకుగాను ఉమ్మడి గుంటూరు జిల్లాల పరిధిలో ఐదు ఔషధ దుకాణాల్ని ఎంపిక చేయగా, అందులో శావల్యాపురం సొసైటీ తరఫున ఒకటి మంజూరు అయినట్లు చెప్పారు. దుకాణంలో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం క్వాలిఫైడ్ వ్యక్తి ద్వారా అమ్మకాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు ఉన్నవలో జగనన్న సురక్ష

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామ సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై. హనుమారెడ్డి తెలిపారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని 11 రకాల ధ్రువపత్రాల్ని లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. గ్రామస్తులంతా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్యుల సేవా గుణం శ్లాఘనీయం

- పట్టణ ఆర్యవైశ్య సంఘ సమావేశంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి
- 102మందికి చీరలు, పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు పంపిణీ



మహిళకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

నరసరావుపేట: ఆర్యవైశ్యుల సేవా గుణం శ్లాఘనీయమని, వ్యాపారంతో పాటు దాతృత్వంలో వారికెవరూ సాటిలేరని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక పట్టాభిరామ స్వామిదేవాలయంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించిన పట్టణ ఆర్యవైశ్య సంఘ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రావతరణ కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు, రాష్ట్రానికి 16సార్లు ఆర్థిక బడ్జెట్ సమర్పించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యలు కులమతాలకు అతీతంగా అందరూ గుర్తు పెట్టుకోతగిన వ్యక్తులని తెలిపారు. ఏదైనా ఒక మంచి కార్యక్రమం చేయాలంటే దానగుణం ఉండాలన్నారు. కోటప్పకొండలో నిర్మిస్తున్న నాలుగు సూట్ రూమ్‌ల నిర్మాణానికి ఆర్యవైశ్యులు మాజేటి సాంబశివరావు, ఊర భాస్కరరావు, వి.సాంబశివరావు, కె.పి.రంగారావు సహకారం అందజేస్తున్నారని తెలిపారు. ఏ కార్యక్రమం చేపట్టినా తామున్నామంటూ ఆర్యవైశ్యులు అందజేస్తున్న సహాయ, సహకారాలకు అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్యుల్లో చాలామంది పేదవారు ఉన్నారన్నారు. వారిని ఆదుకునేందుకు సంఘం నాయకులు చేస్తున్న ప్రయత్నాల్ని అభినందించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో 102మంది పేద ఆర్యవైశ్యులకు నిత్యావసరాలు, మరో 102మందికి పేద మహిళలకు చీరలు, 102మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పుస్తకాలు పంపిణీని ఎమ్మెల్యే గోపిరెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా ఎనిమిది మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కోటేశ్వరరావు, గాదంశెట్టి రాంబాబు, కోశాధికారి కొప్పురావూరి మోహనరావు, గౌరవాధ్యుడు కొత్త సాంబశివరావు, మాజీ ప్రిన్సిపాల్ ఎమ్మార్కే మూర్తి, దివ్వెల రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, విద్యాసంస్థల ప్రతినిధి రామకృష్ణ, ఎన్.సురేంద్ర పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు ఇళ్ల పట్టాలు అందజేస్తాం

నరసరావుపేట: నెలరోజుల వ్యవధిలో వందమంది పేద బ్రాహ్మణులు ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం రాత్రి కోటసెంటర్‌లోని వాసవీ కల్యాణ మండపంలో శ్రీ వాగ్దేవి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పేద బ్రాహ్మణులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలోన పలు దేవాలయాలకు టీటీడీతో ఆర్థిక సాయం చేయించి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 30మంది బ్రాహ్మణులకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని చెప్పారు. సమాజంలోని పురోహితుల్ని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 108మంది పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దిలీప్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యశాస్త్రి, రొంపిచర్ల ఆంజనేయులు, లక్ష్మీనారాయణశాస్త్రి, దాత అచ్చిరెడ్డి, నిడమానూరి సురేంద్ర, పురోహితులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో ప్రశాంతత కోరుతూ శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

చిలకలూరిపేట టౌన్: మణిపూర్‌లో శాంతి చేకూరాలని చిలకలూరిపేట మండల గాస్పెల్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి ప్రారంభమై పాత గవర్నమెంట్ ఆసుపత్రి, చౌత్రా సెంటర్, రూరల్ పోలీసు స్టేషన్, కళామందిర్ సెంటర్ మీదుగా గడియార స్తంభం, విశ్వనాథ సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో చిలకలూరిపేట నియోజకవర్గంలోని పాస్టర్లు, దైవ సహాయకులు, యువత, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు వెంటనే సమసిపోవాలని, ప్రభుత్వం స్పందించి వాటిని అదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో జీయూపీఎఫ్, ఐపీఎఫ్, జేపీఎఫ్ పాస్టర్లు నందమూరి క్రిస్టర్, ఎన్. థామస్, టి. రత్నకుమార్, టి. లూకా, ఎం.ఎస్. మూర్తి, ఎం. జ్ఞానయ్య, క్రీస్తు రాజు, టి. సాంబశివరావు, పి. భాగ్యరాజు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

మంత్రి అంబటి రాంబాబు



లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మంచికంటిని అభినందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన నాయకులు

సత్తెనపల్లి: ప్రపంచ దేశాల్లో లయన్స్ క్లబ్ ద్వారా అనేక మంది సహాయ సహకారాలు అందుకొంటున్నారనీ, మనదేశంలో కూడా కరోనా సమయంలో లయన్స్ క్లబ్ విస్తృతంగా రోగులకు అండగా నిలచిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి. రాంబాబు అన్నారు. పట్టణంలో రఘురామ్‌నగర్‌లో గల వెంకటేశ్వర గ్రాండ్ ఏసీ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన 2023-24 లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు క్లబ్ మాజీ అధ్యక్షుడు తవిటి భావన్నారాయణ అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లు ఎన్నో ఏళ్ళ నుంచి అర్హులైన పేదలకు కంటి ఆపరేషన్స్ చేయిస్తూ ఇంకా అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించడం ప్రశంసనీయం అని కొనియాడారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణం చేసిన అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి తోట పద్మావతి, ఇతర సభ్యుల్ని ఆయన అభినందించారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల అభివృద్ధికి విద్యావంతులు, ఆర్థికంగా మెరుగైన వారు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు వెట్ గ్రైండర్లు, కుట్టు మిషను, చీరలు, దుప్పట్లు, విద్యార్థులకు నోటుపుస్తకాలను దాతలు సత్యశేఖర్, పొత్తూరి రామకోటయ్య, పెద్దింటి చంద్రయ్య, నిమ్మలపల్లి శ్రీనివాస్, షకీలా శ్రీధర్ ఆర్థిక సౌజన్యంతో అందించగా వాటిని పంపిణీ చేశారు. క్లబ్ సీనియర్ సభ్యులు కంబాల వెంకటేశ్వరరావు, వై.పి. మురళి మాస్టర్ ఆఫ్ సెర్మనీలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ రంగరాజన్, లయన్స్ పి.డి.జి విజయకుమార్‌రెడ్డి, వి.డి.జి. హరిప్రసాద్, ఆర్.సి.కోటేశ్వరమ్మ, జడ్.సి తోట చిన సాంబశివయ్య, క్లబ్ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం



దేవిడ్ మృతదేహం

నాదెండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తూబాడు పంట పొలాల్లో చోటు చేసుకుంది. ఎస్ఐ జె. బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తూబాడు గ్రామానికి చెందిన రావూరి డేవిడ్ (45) నాలుగేళ్లుగా ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, పోతుకట్లలో నివాసం ఉంటున్నాడు. ఏడాది కిందట వీధి కుక్క కరిచింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా స్వస్థత చేకూరకపోడంతో మనస్తాపానికి గురయ్యాడు. మూడు రోజుల కిందట ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పొలాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహం జేబులోని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రావూరి సువార్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించటంతో పోతుకట్లకు తరలించారు. మృతుడికి వివాహమైన కుమార్తె, బీటెక్ చదువుతున్న కుమారుడు ఉన్నారు.